'పెద్దచెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు చేయండి'

మన్సూరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలకు మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేపట్టాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పెద్దచెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా అలమయ్యనగర్‌కాలనీ పార్కు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన కోరారు.

కుమ్మరికుంటలో గుర్రపుడెక్క తొలగింపు

హయత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండగను పురస్కరించుకుని మహిళలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు కుమ్మరికుంటలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తున్నట్లు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కుమ్మరికుంటలో నీటి కలుపు తీయు యంత్రంతో గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బతుకమ్మ పండగ రోజున కుమ్మరికుంట వద్ద బతుకమ్మ ఘాట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● హయత్‌నగర్ డివిజన్‌లోని సిద్ధి వినాయకనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు.

కాలనీ ముఖ ద్వారానికి శంకుస్థాపన

వనస్థలిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ కాంత్రిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కాలనీ ముఖ ద్వారానికి కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి, వి.మనోహర్, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి చెత్తసేకరణ రిక్షాల పంపిణీ

మన్సూరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అందజేసిన చెత్తసేకరణ రిక్షాలను సోమవారం నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో పారిశుధ్య సిబ్బందికి హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ నీలిమ, జవాన్ దర్శన్, బీజేపీ నాయకులు సంజీవ రెడ్డి, మునిందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్, శివమ్మనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

కొత్తపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్, శివమ్మ నగర్‌లలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కాలనీల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హైడ్రా సిబ్బందిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారీ వర్షాల వేళ ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలను ముందుగానే గుర్తించాలని, వాటి పరిష్కారానికి ఆయా ప్రాంతాల్లో పర్యటించాలని సూచించారు. కార్యక్రమాల్లో జీహెచ్ఎంసీ ఏఈ షరీఫ్, హైడ్రా ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్, మార్షల్ వీరయ్య సిబ్బంది పవన్, హనుమ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ శైవ మహాపీఠంలో చతుర్వేద పారాయణం


వేద ఘోష-చతుర్వేద పారాయణంలో పాల్గొన్న వేద పండితులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నాగోల్ శివపురిలోని శ్రీశైవ మహాపీఠంలో వేద ఘోష-చతుర్వేద పారాయణం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపారాయణ పథకంలో పనిచేస్తున్న హైదరాబాద్ ప్రాంతీయ వేద పండితులు సెప్టెంబరు నెలకు సంబంధించిన కార్యక్రమాన్ని 3రోజుల పాటు నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన వేద ఘోష- చతుర్వేద పారాయణం ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు ఉంటుందని శ్రీ శైవ మహాపీఠం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సరూర్‌నగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హామీ ఇచ్చారు. బాలాపూర్ మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు సోమవారం ఆమెను జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకే ప్రీ ప్రైమరీ స్కూళ్ల బాధ్యతలు అప్పగించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వారికి రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతానని సబితారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మెరుగైన వైద్యం : సుధీర్‌రెడ్డి


తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌కు గణనాథుడి లడ్డూను అందజేస్తున్న యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి - మన్సూరాబాద్ (ఆంధ్రజ్యోతి)

మన్సూరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీకి చెందిన రవికిరణ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1.75లక్షలు మంజూరయ్యాయి. ఎల్‌ఓసీ పత్రాన్ని సోమవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడి కుమారుడు సాయికిరణ్‌కు ఎమ్మెల్యే అందజేశారు.

కొత్తపేట: కొత్తపేట నాగేశ్వర్‌రావు కాలనీ వాసి భాస్కర్‌రావుకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. లబ్ధిదారుడి కుమారుడు మనీష్‌కు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో 19 మంది జీపీవోలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యో): గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్‌వో/వీఆర్‌ఏ వ్యవస్థను తిరిగి గ్రామ పాలన అధికారులు (జీపీవో) రూపంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చింది. అందులో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 22 క్లస్టర్‌లకు గాను 19 మంది జీపీవోలను ప్రభుత్వం కేటాయించింది. సోమవారం తొర్రూర్ క్లస్టర్ జీపీవో మినహా మిగతా 18 మంది అధికారులు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. మజీద్‌పూర్, కుంట్లూర్-2, బండరావిరాల క్లస్టర్ గ్రామాలకు త్వరలో కేటాయించనున్నారు.

భాగ్యనగర్ సొసైటీ పీఐసీ చైర్మన్‌గా బంగారి బాబు



సరూర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్) నూతన పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ) చైర్మన్‌గా మాజీ వైస్ చైర్మన్ బంగారి బాబు(కాంగ్రెస్) నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా సహకార శాఖ అధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీల పాలకవర్గాల పదవీ కాలం గత ఫిబ్రవరిలోనే ముగియగా ఎన్నికలు నిర్వహించకుండా పాత పాలకవర్గంలోని ప్రతినిధులను పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగిస్తూ పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

హయత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళలో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ని హయత్‌నగర్ పోలీసులు సీజ్ చేశారు. గత కొంత కాలంగా కొహెడా, ఉమర్‌ఖాన్‌గూడ గ్రామాల నుంచి రాత్రి వేళలో పెద్ద ఎత్తున్న మట్టి తవ్వకాలు జరిపి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు ఆదివారం రాత్రి కొహెడా సర్వీస్ రోడ్డుపైన కాపు కాయగా ఒక టిప్పర్‌లో మట్టి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్‌లో 'యాత్రదానం' ప్రారంభం

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్‌లో సోమవారం యాత్రదానం పథకం ప్రారంభించినట్లు రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ఈ పథకం ద్వారా రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి అరుణాచలం, శ్రీశైలం, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, వరంగల్, కాళేశ్వరం, అనంతగిరి, కొమురవెల్లి, ద్వారకా తిరుమల, అన్నవరం వేములవాడ తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు బస్సులు నడుస్తున్నాయని ఆమె వివరించారు. దాతలు తమ కుటుంబసభ్యులు, బంధువులు మాత్రమే కాకుండా అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, వెనుకబడిన వర్గాల వారికి కూడా యాత్రలు కానుకగా ఇవ్వవచ్చని వివరించారు. 200 నుంచి 5వందల కిలో మీటర్ల పరిధిలో ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సుల్లో రూ.26,707ల నుంచి రూ.50,962 వరకు స్పాన్సర్ షిప్ ఖర్చు ఉంటుందని ఆమె వివరించారు.

ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధించాలి : ఆర్ఎస్‌పీ

వనస్థలిపురం, సెప్టెంబరు 15(ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించినప్పుడే ప్రతి రంగం లాభాల్లో ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ చింతలకుంటలోని కార్యాలయంలో సన్‌స్టోన్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ (స్మాక్స్) ఆరవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, అగ్రికల్చర్ డైరెక్టర్ లక్ష్మీబాయి, రితీక, సురేష్, అలివేలుమంగ, సూర్యప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి'

చంపాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని కార్పొరేటర్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు కోరారు. కళాశాలల మూసివేత నేపథ్యంలో హస్తినాపురం చౌరస్తాలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వారు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీసీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్, జేఏసీ ప్రతినిధులు బచ్చు రామకృష్ణనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో పీడీఎస్‌యూ ధర్నా

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నిర్వహించనున్న నిరవధిక బంద్‌కు పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ గ్రేటర్ కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ శ్రీకాంత్, నాగరాజు, పీడీఎస్‌యూ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రవీందర్‌రెడ్డి



చాదర్‌ఘాట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక అంధుల బాలుర పాఠశాల దారుషిఫాలో విధులు నిర్వర్తిస్తున్న అంధ ఉపాధ్యాయుడు కందాల రవీందర్‌రెడ్డి హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. అధికారులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో తన పేరు ప్రకటించారని ఆయన మీడియాకు తెలిపారు. నల్గొండ జిల్లా నకిరికల్ మండలంలోని నోముల గ్రామం నివాసి కందాల రవీందర్‌రెడ్డి బహదూర్‌పుర మండలం పరిధిలోకి వచ్చే ప్రభుత్వ ప్రాథమిక అంధుల బాలుర పాఠశాలలో అంధ విద్యార్థిగా విద్యనభ్యసించారు. ఇదే పాఠశాలలో అంధ ఉపాధ్యాయునిగా 15 ఏళ్లుగా పనిచేస్తున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన కందాల రవీందర్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి అభినందించారు.

చేయూత పెన్షన్లు పెంచండి : ఎమ్మార్పీఎస్

ఎల్బీనగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులు, చేయూత పెన్షన్లు వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ డింమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాదిగ, చంపాపేట డివిజన్ ఇన్‌చార్జి మల్లెపూవు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

సైదాబాద్: దివ్యాంగుల, చేయూత పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ రాంబాబు, వీహెచ్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

'చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలిసిపోతారు'

హయత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ పోరాట పటిమ నేటికీ సజీవంగా నిలిచి ఉందని... చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలిసిపోతారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి హెచ్చరించారు. సోమవారం సీపీఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో హయత్‌నగర్ బస్ డిపో వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోటర వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీంద్రాచారి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, శాఖ కార్యదర్శి సరితతో పాటు పలువురు పాల్గొన్నారు.